

ఏలూరు గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 02 నవంబర్ 2024


## పండుగ రోజు ప్రజాదర్బార్‌కు..

**చిన్నమండెం,నవంబర్ 01, ప్రభాతవార్త:**



రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి పండుగ రోజు కూడా ప్రజలు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తూ ముందుకు వెళ్తున్నారు. గతంలో ప్రజల సమస్యల పరిష్కారానికి నోచుకోకపోవడంతో నేడు అధిక సంఖ్యలో ప్రజలు ప్రజాదర్బార్ కార్యక్రమానికి వచ్చి తమ సమస్యలు విన్నవించుకుంటున్నారని, ఈ సమస్యలు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని మంత్రి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, జిల్లాలోని అధికారులందరూ బాధితుల సమస్యలను సీరియస్‌గా తీసుకొని పరిష్కరించాలన్నారు.

# దీపావళి కానుకగా మహిళల సేవలో దీపం

- 3.74లక్షల మందికి దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు
- ఏడాదికి రూ.32కోట్ల లబ్ధి
- జిల్లాలో రూ.90కోట్ల సామాజిక పింఛన్ల పంపిణీ
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి, నవంబరు 1, ప్రభాతవార్త:**

దీపావళి కానుకగా రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు దీపం-2 పథకం కింద సంవత్సరానికి 3 సిలిండర్లను ఉచితంగా అందజేయడం ఎపేద మహిళల జీవితాలలో నిజమైన వెలుగులు నింపుతుందని జిల్లా కలెక్టర్ శ్రీదర్ చామకూరి తెలిపారు. శుక్రవారం రాయచోటి బంగ్లా సమీపంలోని జూనియర్ కళాశాల మైదానంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలులో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా దీపం-2 పథకాన్ని ప్రారంభించడం సంతోషించదగిన విషయం. 1999-2000సంవత్సరంలో అప్పటి సీఎంగా ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. ప్రస్తుతం దీపం-2 పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారు. జిల్లాలో 3,74,252 మందికి ఏడాదికి రూ.32కోట్ల మేర ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధి చేకూరుతుందన్నారు. 4 మాసాలకు ఒకటి చొప్పున సంవత్సరానికి 3 సిలిండర్లు పేద మహిళలకు ఉచితంగా అందుతాయి. దీనిపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సిలిండరు తీసుకున్న తరువాత నగదు చెల్లింపు చేస్తారని వారికి 48 గంటల్లో తిరిగి వారి ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. ఈ పథకాన్ని అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే గ్రామ వారు సచివాలయంలో నమోదు చేసుకోవాలని కలెక్టరు పేర్కొన్నారు.

**1వ తేదీనే వంద శాతం పింఛన్లు పంపిణీ**

సీఎం దృఢ సంకల్పంతో దీపం-2 పథకంతో పాటు నేడు సామాజిక పింఛన్ల రూపంలో మరొక సంక్షేమ లబ్ధి కూడా ప్రత్యక్షంగా ప్రజలకు ఇంటివద్దనే అందుతోంది. జిల్లాలో ప్రతి నెల రూ.90కోట్ల మేర సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే అందజేస్తున్నామని కలెక్టరు తెలిపారు. టీడీపీ నాయకులు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, ఏపీ గార్డెన్స్ ప్రాంతానికి చెందిన బద్రి సంఘ సభ్యురాలు పద్మజ, శ్రీనివాస గ్రూప్ సభ్యురాలు షేహతాజ్‌లు మాట్లాడుతూ మహిళా మూర్తులకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ ఒక వరమని సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకం అమలులో భాగంగా నేడు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాస్, ఐఓసీ సేల్స్ అధికారి ప్రవీణ్‌కుమార్, డీఎస్‌వో రఘురాం, టీడీపీ నాయకులు రాహుల్‌రెడ్డి, అధికారులు, మహిళా లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే మిషన్ పాత్ హోల్ ఫ్రీ ద్వారా
# రహదారులకు మరమ్మత్తులు

**జిల్లా కలక్టర్ శ్రీధర్ చామకూరి**

**రాజంపేట,నవంబర్ 01,ప్రభాత వార్త :**



ఈ నెల నవంబర్ 2 నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ పాత్ హోల్ ఫ్రీ ద్వారా ప్రవేశపెట్టిన దెబ్బతిన్న రహదారులకు మరమ్మత్తుల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో బాగంగా అన్నమయ్య జిల్లాలోని 6నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తు పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారులను మరమ్మత్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ పాత్ హోల్ ఫ్రీ కార్యక్రమాన్ని ఈ నెల 2 న శనివారం ప్రారంభించనుందని ఇందులో బాగంగానే అన్నమయ్య జిల్లాలో 6 నియోజక వర్గాల్లో ఆరు ముఖ్యమైన రహదారుల్లో కూడా ఇదే రోజునే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గంలో సంబేపల్లి సీకే రోడ్డు నుంచి నరసారెడ్డి పల్లె రహదారిపై దెబ్బతిన్న ప్రదేశాలలో కోడూరు నియోజకవర్గంలో పెద్దఓరంపాడు నుంచి ఎల్లాయ పల్లె వరకు ఉన్న రహదారి, పీలేరు నియోజకవర్గంలో పొంతల చెరువు నుంచి తిమ్మాపురం రహదారిపైన మదనపల్లె నియోజకవర్గంలో అనంతపూర్ పలమనేరు రహదారి నుంచి బొమ్మనచెరువు రహదారి, రాజంపేట నియోజకవర్గంలో సిఆర్‌పి రహదారి నుంచి తాళ్లపాక వరకు తంబళ్లపల్లె నియోజకవర్గంలో కోటకొండ నుంచి దందువారిపల్లె వరకు రహదారులపైన ఉన్న గుంతలను పూడ్చేందుకు మరమ్మత్తుల పనులు మిషన్ పాత్ హోల్ ఫ్రీ ద్వారా చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమమంలో మంత్రి, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారని ఆయన తెలిపారు.

## 3న జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం

**రాయచోటి, నవంబరు 1, ప్రభాతవార్త:**

ఈనెల 3వ తేదీ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రోడ్లు భవనాల శాఖామాత్యులు బీసీ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో క్రీడల శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా నందలి ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర నివేదికలు రూపొందించాలని జిల్లా అధికారులందరికీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

## తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచిత గ్యాస్ పంపిణీ

- జనవరి నుండి తల్లికి వందనం అమలు
- ఆర్థిక లోటున్నా ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం
- నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి



**పులివెందుల, నవంబరు 1, ప్రభాతవార్త ః**

తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. పులివెందుల పట్టణంలోని శ్రీసాయి హెచ్‌పిగ్యాస్ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం దీపం2 పథకం ద్వారా ప్రతి మహిళకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీటెక్ రవి హాజరై మాట్లాడారు. తెల్లరేషన్‌కార్డు ఉండి ఏదో ఒక ఏజన్సీలో నమోదు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఎవరికైనా ఈ పథకం రాకపోతే సంబంధిత అధికారులకు కానీ, మా పార్టీ కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రం దృష్టికి తీసుకువస్తే మీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ వస్తున్నామన్నారు. ఇప్పటికే డ్వాక్రా మహిళల రుణాలను రూ.5 నుండి రూ.10లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూడా రద్దు చేయడం జరిగిందన్నారు. కొప్పర్తి, కర్నూలు పారిశ్రామికవాడల్లో మౌలిక వసతుల సదుపాయాల కోసం రూ.2500కోట్లు మంజూరు చేశారన్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందని, ఎవరికైనా రాకపోతే 1961 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. ఈ పథకం ద్వారా పులివెందుల నియోజకవర్గంలో 64477 మందిని లబ్ధిదారులుగా గుర్తించామని, పులివెందుల మండలానికి సంబంధించి 16147మందిని లబ్ధిదారులుగా గుర్తించామన్నారు. ప్రతి ఒక్కరు ఉచిత గ్యాస్ సిలిండరు కోసం అక్టోబరు 29 నుండి మొదటి సిలిండరు పొందేందుకు అర్హులన్నారు. లబ్ధిదారులు గ్యాస్ సిలిండరుకు మొదట డబ్బులు కట్టాలని, సిలిండరు డెలివరీ అయిన 48 గంటల్లోగా లబ్ధిదారుని ఖాతాలో డబ్బులు పడతాయన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. తహసీల్దారు నజీర్ అహమ్మద్, మున్సిపల్ కమీషనరు రాముడు ఉచిత గ్యాస్ పంపిణీ పథకం గురించి లబ్ధిదారులకు వివరించారు. అనంతరం లబ్ధిదారులకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, ఆర్డీవో భానుశ్రీ, తహసీల్దారు నజీర్ అహ్మద్, కమీషనరు రాముడు చేతుల మీదుగా ఉచిత గ్యాస్ సిలిండరును అందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరి వెంకటరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొరయర్ ప్రసాద్‌రెడ్డి, తెదేపా నాయకులు నల్లగారి భాస్కర్‌ఔెడ్డి, మైనార్టి నాయకులు మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## దీపావళితో ప్రతి ఇంటా పండగ

**జమ్మలమడుగు, నవంబరు 1, ప్రభాతవార్త:**



ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన దీపం పథకం కింద 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న హామీని దీపావళి సందర్భంగా శుక్రవారం గ్యాస్ బండ పంపిణీ కార్యక్రమం జమ్మలమడుగు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఈ దీపావళితో మహిళలకు వంటింట్లో పండగేనని మహిళలనుద్దేశించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్న ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గర అవుతుందని పేర్కొన్నారు. ఆడబిడ్డలు ఆనందంగా ఉండి ఆ ఇల్లు సుఖ సంతోషాలతో కలకలలాడుతుందని రాష్ట్రంలో మహిళలు సంతోషంగా ఉంటే కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు రాష్ట్ర ప్రజలకు మరింత దగ్గరవుతాయన్నారు. అదే విధంగా టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ సమావేశం చూస్తుంటే మహిళల మొహాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని తెలిపారు. కల్తీ మద్యంతో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని అందుకే రాష్ట్ర మహిళల వుసురు తగిలి వూహించని స్థాయిలో ఓటమి మూటగట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఎమ్మార్వో శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కమిషనర్, సీఐ లింగప్ప, గోన పురుషోత్తం, నాగేశ్వర్‌రెడ్డి, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితం

**కమలాపురం, నవంబరు 1, ప్రభాతవార్త:**



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలులో మరో పథకం చేరిందని సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద దీపం-2.0 పథకానికి ఆర్డీవో జాన్ ఎర్విన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి మరో పథకాన్ని ప్రారంభించిందన్నారు. మొదట నగదు చెల్లించి సిలిండరు తీసుకోవాలని అనంతరం 48 గంటల్లో చెల్లించిన నగదు తిరిగి తమ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. రాబోవు కాలంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అలాగే 18 నుంచి 58 సంవత్సరాల లోపు మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహకారం అందిస్తారని త్వరలో నిరుద్యోగ బృతి కూడా అందిస్తారని ఆయన తెలిపారు. కమలాపురంలో ప్రజలకు ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్ కూడా ప్రపారంభిస్తున్నామని తెలిపారు. నవంబరు నుంచి మార్చిలోపు మొదటి ఉచిత గ్యాస్ సిలిండరు బుక్ చేసుకోవచ్చన్నారు. ఇలా ఏడాదికి 3 సిలిండర్లు చొప్పున అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాంరెడ్డి, ఎంపీడీవో జ్యోతి, నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథం, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మార్పురి మేరి, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, దాది రామయ్య, ప్రసాద్‌రెడ్డి, రాఘవరెడ్డి, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## కుక్క కాటుతో చిన్నారికి తీవ్ర గాయాలు

**- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు**

**చిట్వేలి, నవంబరు 1, ప్రభాతవార్త:**

చిట్వేలి పంచాతీలు కుక్కల బెడద ఇబ్బందిగా మారిందని అధికారులు స్పందించాలని ఇదివరకే హెచ్చరించినా చర్యలు లేకుండా ఉండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సాక్ష్యమే శుక్రవారం మేదర వీధికి చెందిన రిషి(10) సంవత్సరాల బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వృషణాలను చీల్చడంతో బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు అన్సారి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో రాజంపేటకు తరలించారు. ప్రధాన వీధుల్లో ఒంటరిగా పిల్లలు, మహిళలు నడిచి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. పత్రికా రూపంలో పలుమార్లు విన్నవించినా జిల్లా యంత్రాంగం దృష్టి సారించిన పాపానపోలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రజలకు కుక్కల నుంచి రక్షణ కల్పించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## తంగేడుపల్లెలో టీడీపీ నేతల దౌర్జన్యం

**బద్వేలు, నవంబర్1 (ప్రభాతవార్త):**



నియోజకవర్గంలోని బి.కోడూరు మండలంలోని తంగేడుపల్లెలో వైసీపీ కన్వీనర్ వెంకటసుబ్బయ్యపై టీడీపీ సర్పంచ్ రమణారెడ్డి అనుచరులు దాడిచేసి తన పంటలకు నష్టం కలిగించినట్లు పేర్కొన్నారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు గత ఎన్నికలలో తాను వైసీపీ తరపున ఏజంటుగా కూర్చున్నందుకు ఈ దాడిచేసినట్లు తెలుపగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ లు సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటసుబ్బయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తాను ఈ భూమిని 2008 నుండి సాగు చేసుకుంటున్నానని, ఆరు సంవత్సరాలుగా జామ, నిమ్మ, మామిడి చెట్లను పెంచుకుంటున్నానని ఇక్కడ ఎలాంటి వివాదం లేదని స్థానిక తహశీల్దారు, ఎస్ఐలు కూడా ధృవీకరించారని, అలాగే రమణారెడ్డి అనుచరులు జేసీబీ, దోజర్లతో వచ్చి తన పంట పొలాన్ని ధ్వంసం చేశారన్నారు. ఈ దాడిలో తాను గాయపడడంతో పాటు తీవ్రంగా నష్టపోయానని దీనిపై చర్యలు తీసుకోవాలని వారి దృష్టికి తీసుకెళ్లగా వారు బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## మద్యం దుకాణంపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి

**పిఎస్‌లో ఫిర్యాదు చేసిన నిర్వాహకుడు**

**ములకలచెరువు, నవంబర్ 1 ప్రభాతవార్త :**

ములకలచెరువులోని ఆర్ఆర్ మద్యం దుకాణంపై గుర్తు తెలియని వ్యక్తులు మద్యం బాటిల్లను ధ్వంసం చేసి దాడికి పాల్పడిన సంఘటన చోటు చేసుకొంది. మండల కేంద్రం, మదనపల్లె ఆర్ఆర్ మద్యం దుకాణం నిర్వాహకుడు నరసింహులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలావున్నాఇ. గురువారం మద్యాహ్నం మూడుగంటల సమయంలో బ్రాందీషాపులో యదావిధిగా విక్రయాలు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు మద్యం దుకాణం వద్దకు వచ్చారు. మద్యం దుకాణంలో లేని వైన్‌తో పాటు ఇతర మద్యం కావాలని అడిగారు. అవి షాపులో లేవని పనిచేస్తున్న వారు తెలిపారు. మేము అడిగిన వైన్‌బాటిల్స్ ఇవ్వలని దురుసుగా ప్రవర్తించారు. అప్పటికే మద్యం సేవించిన గుర్తుతెలియని వ్యక్తులు మద్యం దుకాణంలో ప్రవేశించి దుకాణంలో పనిచేస్తున్న వారిపై దాడిచేశారు.మద్యం బాటిళ్ళను ఇష్టారాజ్యంగా కొట్టి పారిపోయారు. జరిగిన విషయాన్ని బ్రాందీషాపు యజమానికి ఫోన్ ద్వారా జరిగిన విషయాన్ని తెలిపారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా స్పందించిన సిఐ రాజారమేష్, ఎస్ఐ గాయత్రిలు సిబ్బందితో బ్రాందీషాపు వద్దకు చేరుకొని గుర్తు తెలియని వ్యక్తుల కోసం చుట్టుపక్కల గాలించారు. నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నరసింహులు మాట్లాడుతూ మద్యం దుకాణంపై దాడిచేసి మద్యం బాటిళ్ళను ధ్వంసం చేసి నష్టం రూ.50వేలు చేశారని తెలిపారు. షాపుపై దాడిచేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి బ్రాందీషాపుపై దాడి చేయించిన సూత్రదారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై డిఐఓకు ఫిర్యాదు

**రాజంపేట అర్బన్, నవంబర్ 01, ప్రభాతవార్త:**



ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పిడిఎస్‌యూ ప్రశ్నించింది. ఈ మేరకు శుక్రవారం రాజంపేటకు వచ్చిన డిఈఓకు ఫిర్యాదు చేసింది. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర, స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ మాట్లాడుతూ రాజంపేట పట్టణంలో పలు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు అతిక్రమిస్తున్న స్థానిక అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పిడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాజంపేట పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిప్యూటి డిఇఓ శివప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇష్టానుసారంగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు పూర్తి విఫలమయ్యారని అన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు పాఠశాల నిర్వహిస్తూ ఈ పాఠశాలలో చదువుతున్న విధ్యార్థులు హాజరు శాతం ఎక్కడ వేస్తున్నారని అడిగారు. తక్షణమే ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. రాజంపేట పట్టణంలో ఒక విధ్యాసంస్థలు కూడ కనీసం వసతులు లేకపోయినప్పటికి 8వ తరగతికి అప్డేట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా నాయకుడు రామ్‌చరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్య వర్ధన్, వినోద్, పవన్‌కళ్యాణ్, కుమార్, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

## దీపం పథకాన్ని ప్రారభించిన రితేష్‌రెడ్డి

**గోపవరం, నవంబర్ 1 (ప్రభాతవార్త):**



మండల పరిధిలోని శ్రీనివాసపురంలో శుక్రవారం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి పాల్గొని దీపం పథకం లబ్దిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా ప్రజలకు హామీలను నెరవేరస్తూ ప్రజారంజక పాలన అందిస్తోందన్నారు. అందులో భాగంగానే దీపం పథకం ప్రారంభించినట్లు ఆయ తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని పథకాలు అందించి ప్రజలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జా రోశన్న, ఆర్డీవో చంద్రమోహన్, తహశీల్దారు త్రిభువన్‌రెడ్డి, ఎంపీడీవో రామనాథరెడ్డి, ఎంపీపీ జి.ధనలక్ష్మి, బద్వేలు పట్టణ టీడీపీ అధ్యక్షులు వెంగళరెడ్డి, మండలస్థాయి ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పట్టణం నడిబొడ్డున వెలగని లైట్లు

**యర్రగుంట్ల, నవంబర్ 01, ప్రభాతవార్త:**

యర్రగుంట్ల పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో గల ఫ్లడ్ లైట్లు గత కొన్ని రోజులుగా వెలగక చీకటి కమ్ముకొని ప్రజలు చిరాకు పడుతున్నారు. రాత్రి సమయంలో సుదూర ప్రాంతాలు హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరులకు పోయే ప్రయాణీకులు నాలుగు రోడ్ల కూడలిలో బస్సుల కోసం వేచి ఉండవలసి వస్తుంది. ఇలాంటి సంధర్భాలలో చీకటిలో వారు అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా నాలుగు రోడ్ల కూడలిలో చుట్టూ అనేక మంది పేద, మధ్య తరగతి ప్రజలు వారి వృత్తి రీత్యా తోపుడు బండ్లలో పూలు, పండ్లు, కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. సూర్యాస్తమయం త్వరగా అవడంతో పాటు లైట్లు వెలగకపోవడంతో వారి వ్యాపారాలు కూడ చీకటిలోనే సాగించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి పట్టణానికి మకుటమైన నాలుగు రోడ్ల కూడలిలో లైట్లు వెంటనే వెలిగేలా చేయాలని కోరుతున్నారు. సాయంత్రం సమయాలలో నా రోడ్ల కూడలి నిత్యం వాహణాలు దారుల రాకపోకలతో రద్దీ అధికంగా ఉంటుంది. అలాంటి సమయంలో కూడ లైట్లు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. కావున అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.



## లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013పై న్యాయ విజ్ఞాన సదస్సు

**కడప లీగల్, నవంబరు 1, ప్రభాతవార్త:**
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్. బాబాఫకీద్దీన్ మరియాపురంలో గల ఏపీజీబీ కాన్ఫరెన్స్ హాలులో లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 మరియు లింగ సున్నితత్వం మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి మరియు లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల నివారణ మరియు పరిష్కారానికి మరియు దానికి సంబంధించిన విషయాల కోసం చట్టం, మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైనప్పుడు పోష్ చట్టం 2013 కింద ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఏపీ రాష్ట్ర అధికార సంస్థ అమరావతి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప మరియు మండల న్యాయ సేవాసమితి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ సంజీవప్ప, గిరి, రాజేంద్రన్, పడగెట్ వార్, కడప రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ ప్రసాద్, సిబ్బంది, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలు తొలగింపు

**సిద్దవటం, నవంబరు 1, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన సిద్దవటం గ్రామ పంచాయతీలో పలు రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న ముళ్ల పొదలు, పారిశుద్ధ్యం తొలగించడానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ భవనాసి నాగరాణి అధ్యక్షతన పనులు చేపట్టారు. ఎగువపేట బ్రాహ్మణవీధి, ఆంజనేయస్వామి, గుడికి వెళ్లే రహదారి పలు ప్రాంతాల్లో పనులు చేపట్టారు. గ్రామంలో ఈ పనులు ఇంకా 2 రోజులు కొనసాగుతాయని గ్రామ సర్పంచ్ ప్రతినిధి భవనాసి ఓబులయ్య అన్నారు. ఈ సందర్భంగా గ్రామ మహిళా సర్పంచ్ భవనాసి నాగరాణి శుక్రవారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీల అభివృద్ధి చెందడానికి నిధులు సమకూరుస్తూ అభివృద్ధికి నిధులు సమకూరుస్తూ అభివృద్ధికి నాంది పలికిన ఘనత మా కూటమి ప్రభుత్వానికి చెందుతుందన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో నిధులు లేక గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందలేదని ఆమె తెలిపారు. గ్రామ పంచాయతీలో ఉన్న ప్రజలు ప్రతి రోజు మీ ప్రాంతాలకు వచ్చే గ్రీన్ అంబాసిడర్ వాహనంలో పొడి, తడిచెత్త వాహనంలో వేయాలని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## కలికిరి పంచాయతీల ఫాగింగ్



**కలికిరి, నవంబరు 1, ప్రభాతవార్త:**
కలికిరి మేజర్ పంచాయతీలో దోమల నివారణకు కలికిరి పంచాయతీ ఈవో అశోక్, కలికిరి పంచాయతీ ఇన్‌ఛార్జి సర్పంచ్ ఎల్లయ్యల ఆధ్వర్యంలో ముమ్మరంగా ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంచాయతీలో దోమల బెడద ఎక్కువ కావడంతో స్థానిక ప్రజలను దోమల బారి నుంచి కాపాడేందుకు ఈవో ప్రత్యేక చర్యలు చేపట్టారు. శుక్రవారం పంచాయతీలో ఫాగింగ్ చేయించి, అలాగే అంటువ్యాధులు రాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

## మర్రికుంటపల్లె పంచాయతీలో పింఛన్లు పంపిణీ



**కలికిరి, నవంబరు 1, ప్రభాతవార్త:**
మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో నస్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ ప్రభుత్వం పంపిణీ చేసిన ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను పింఛనుదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పంపిణీ చేశారన్నారు. పీలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అభివృద్ధి పనులను చేయిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నవాజుల్లా, వీఆర్వో సురేష్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కోడిపందెం స్థావరాలపై పోలీసుల దాడులు

**కలికిరి, నవంబరు 1, ప్రభాతవార్త:**
మండలంలోని చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురం సమీపంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో స్పెషల్ టీం సిబ్బంది, కలికిరి సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోడిపందెం స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. 12 మంది కోడిపందెం రాయుళ్లను అదుపులోకి తీసుకోవడం జరిగిందని మరికొందరు పారిపోయినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి 9 పందెకోళ్లను, రూ.19990 నగదు, 25 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందెం, పేకాట నిర్వహిస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఘనంగా ఇందిరాగాంధీ 40వ వర్ధంతి వేడుకలు



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

**మదనపల్లె, నవంబర్ 1 ప్రభాతవార్త :**
పట్టణంలోని బెంగుళూరు బస్టాండులో మాజీ ప్రధాని దివంగత నేత ఇందిరాగాంధీ 40 వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ అధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ మీనా కుమారి, డాక్టర్ ఎస్‌కె.బాషా, మహబూబ్‌పీర్, మహమ్మద్‌అలీ, అల్లాభక్షు, సయ్యద్‌బేగ్, సోనూ, పవన్, రాజేష్, వినోద్, భయ్యారెడ్డి పాల్గొన్నారు.

## హిందువులపై దాడులను ఖండించిన డోనాల్డ్ ట్రంప్

**మైదుకూరు, నవంబర్ 01, ప్రభాతవార్త:**



డోనాల్డ్ ట్రంప్ అమెరికా మాజీ అధ్యక్షుడు ప్రపంచ వ్యాప్తంగా హిందువుల పైన జరుగుతున్న భౌతిక దాడులకు వ్యతిరేకంగా గళం విప్పారు. హిందువులకు తమ మతస్వేచ్ఛ అవలంబించే విధానాలకు అతిపెద్ద మద్దతు లభించిందన్నారు. అమెరికా మాజీ అధ్యక్షులు కేవలం వైద్య, విద్య, మైనారిటీ హక్కుల(హిందువుల పైన)సేవలు అందించే పద్ధతి ఉంది అలాంటి స్థితి నుండి ప్రపంచ వ్యాప్తంగా హిందువుల పైన దాడులు లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ట్రంప్ నిలవడం వెనుక భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి ఉందన్నారు. మైదుకూరు బిజెపి సీనియర్ నాయకుడు బిపి ప్రతాప్ రెడ్డి, హిందువులకు రక్షణ కోసం గళం విప్పిన ట్రంప్‌కు ధన్యవాదాలు తెలపాలన్నారు.

## చిన్నారులకు టపాకాయలు పంపిణీ



టపాకాయలు అందిస్తున్న దృశ్యం

**మదనపల్లె, నవంబర్ 1 ప్రభాతవార్త :**
పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలోని చిన్నారులు, వృద్దులకు అగ్నిమాపక అధికారి శివప్ప ఉచితంగా టపాకాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెలుగు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగులను, వృద్దులను ప్రేమతో పలకరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వెలుగు సంస్థలో దివ్యాంగులకు అందిస్తున్న సేవల పట్ల సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక ఎస్‌ఎఫ్‌ఓ సుధాకర్‌రెడ్డి, బిటిబి విజయభాస్కర్, ఎల్‌ఎఫ్, జనసైనిక న్యూస్ రిపోర్టర్ నరసింహులు, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, వార్డెన్ స్వీటీ, చిన్నారులు పాల్గొన్నారు.

## కురవంకను అన్ని విధాల అభివృద్ధి చేస్తాం



భూమిపూజ చేస్తున్న దృశ్యం

**మదనపల్లె, నవంబర్ 1 ప్రభాతవార్త :**
కురవంక గ్రామ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే కురవంక గ్రామ పంచాయితీలో వివిధ అభివృద్ధి పనుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. తొలుత ఎమ్మెల్యేను కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా కురవంక గ్రామ పంచాయితీకి ప్రజా అవసరాల మేరకు రూ.30లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరుచేస్తున్నారన్నారు. సర్పంచ్ చలపతి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలను పరిష్కరిస్తుండడం పట్ల ఆయనను అభినందించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భారతి, సెక్రటరీ షబానా, తులసి, శ్రీనివాసులు, బివైఎస్ అధ్యక్షులు పునిత్, హరి, శ్రీధర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యతోనే మెండుగా ఉద్యోగ అవకాశాలు

### టెక్నాలజీస్ టీమ్ లీడర్ ఆంజినేయులు

**మదనపల్లె, నవంబర్ 1 ప్రభాతవార్త :**
విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించడం వల్ల ఉద్యోగాలు ఎక్కువుగా పొందవచ్చునని వాల్‌మార్ట్ టెక్నాలజీస్ టీమ్ లీడర్ ఎస్.ఆంజినేయులు తెలిపారు. శుక్రవారం పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈసిఈ డిపార్ట్‌మెంటు వారు డిస్కవరి ది ఫ్యూచర్ టెక్నాలజీస్‌పై సెమినార్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సెమినార్ ముఖ్య ఉద్దేశం ఏమనగా పరిశ్రమ విద్యార్థుల నుండి ఏం ఆశిస్తోంది. అదే విధంగా పరిశ్రమ విద్యార్థులను ఫర్‌పెక్ట్ వర్కర్‌గా ఉండేందుకు ఏ విధంగా కృషి చేస్తుందో వివరించారు. కొత్త కొత్త టెక్నాలజీస్ ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ సెమినార్లతో మేధాశక్తిని పెంచుకోవచ్చునన్నారు. పట్టుదలతో విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షులు ఎన్.నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, ఈసిఈ హెచ్‌ఓడి డాక్టర్ కెవివివరప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు



**మైదుకూరు, నవంబర్ 01, ప్రభాతవార్త:**
ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆర్యవైశ్యులు ఆయన పటానికి పూలమాల వేసి పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్యులు సునీల్, సంజీవ్ కుమార్, గోపాలకృష్ణ, వెంకటరమణ, శ్రీరాములు, సతీష్, వేణు, శివ చక్రవర్తి, వెంకటసుబ్బయ్య పలువురు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు అమరహే అని నినాదాలతో ఆర్యవైశ్య కమిటీ సభ్యులతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. మన తెలుగు వాళ్ళు, విద్యార్థులు తెలుసుకోవాల్సిన విషయం ఎంతో ఉంది పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్షకు ఆయన ఎంత బాధలు పడ్డాడో మనమందరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలుసుకో...ఓ తెలుగోడా...ఆ ప్రాణ త్యాగ ఫలితమే ఏర్పడ్డ రాష్ట్రం మనది అని పలువురు తెలియజేశారు.

## జాబ్ మేళాలో 21 మందికి ఉద్యోగాలు

**మైదుకూరు, నవంబర్ 01, ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వారి ఆధ్వర్యంలో జాబ్ మేళాను గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ మైదుకూరు నందు నిర్వహించబడినది. ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి, హాజరయ్యారు. జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, తమ గ్రామాలలోనే ఉద్యోగులు కావాలని మరియు తక్కువ జీతం అని నిరుత్సాహ పడవలసిన అవసరం లేదని ప్రారంభంలో కొన్ని ఉడిదుడుకులను తట్టుకొని అపార అనుభవాన్ని సంపాదించిన తర్వాత మంచి జీతభత్యాలతో పాటు హోదా కూడా లభిస్తుంది అని తెలియజేశారు. కలశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలు ప్రతి నెల జిల్లాలోని ప్రతి ఒక్క నియోజకవర్గం లో జరుగుతుంది కనుక ఉద్యోగార్థులు మొదట స్కిల్ హబ్ నిర్వహించే వివిధ సర్టిఫికెట్ కోర్సులలో సరి అయిన శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు అవకాశాలు మెండుగా ఉన్నాయని కనుక అందుబాటులో ఉన్నటువంటి వివిధ రకాల కోర్సులను నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం చాలా అవసరమని అని వివరించారు. మొత్తం 57 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 21 మంది సెలెక్ట్ అయ్యారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి డైకిన్ ప్రతినిధి హరి ప్రసాద్, కీర్తన ఫైనాన్స్ ప్రతినిధి ఉగ్ర నరసింహులు మరియు టోరా టెక్నాలజీస్ సంస్థల అధికారులు హాజరయ్యారని ఆయన వివరించారు.



## పింఛన్ పంపిణీలో పాల్గొన్న ఎంపిడిఓ దివిజ సంపతి

**ఖాజీపేట, నవంబర్ 01, ప్రభాతవార్త:**



ప్రభుత్వం ఏర్పడ్డాక సూపర్ సిక్స్ పథకాలలో ముఖ్యమైన పథకం సామాజిక పెన్షన్లను 3వేల నుండి 4వేల పెంచడం. పెంచడమే కాకుండా వాలంటీర్ల సహాయం లేకుండా సచివాలయ ఉద్యోగులతో లబ్దిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ పంపిణీ పకడ్బందిగా నిర్వహిస్తుంది. దీపావళి సంధర్భంగా నిన్న బ్యాంకులు సెలవు అయినప్పటిని నగదుకి ఇబ్బంది కలగకుండా ముందు రోజే బ్యాంకుల నుండి నగదును సిద్ధం చేసుకొని ఖాజీపేల మండలంలో 1వ తారీఖు వేకువ జాము నుండే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టారు. ఖాజీపేట సచివాలయం-2 పరిధిలో ఎంపీడీఓ దివిజ సంపతి స్వయంగా దగ్గరుండి పెన్షన్ల పంపిణీ తీరుతెన్నులని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఈ ఒక్కరోజే 94శాతంకు పైగా పెన్షన్ల పంపిణీ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారు. నవంబర్ నెలకి సంబంధించి ఖాజీపేట మండలంలో మొత్తం 7329 మంది లబ్దిదారులకు గాను 3కోట్ల 15లక్షల రూపాయలు మంజూరు కాగా దాదాపు 6900మందికి పైగా లబ్దిదారులకు 2కోట్ల 90లక్షల రూపాయల సొమ్ముని పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాజీపేట-2 సచి వాలయ సెక్రటరీ తులసీకుమార్‌రెడ్డి, వెల్ఫేర్‌అసిస్టెంట్ హేమలత పాల్గొన్నారు.

## కడప నుంచి గిద్దలూరు రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలి

**కాశినాయన, నవంబర్ 1 ప్రభాతవార్త :**



కడప నుంచి గిద్దలూరుకు రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని వరల్డ్ అంబేద్కర్‌సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్యాల ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నుంచి గిద్దలూరుకు రైల్వేలైన్‌ను ఏర్పాటు చేస్తే అటు విజయవాడకు, ఇటు చెన్నై, హైదరాబాద్ వెళ్లేందుకు ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. అలాగే రవాణా సౌకర్యంతో పాటు ఆదాయం పెరిగేందుకు వీలు కలుగుతుందని దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలని, ఇందుకు తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అలాగే జిల్లా ఎంపీ, రైల్వే సెంట్రల్ స్టాండింగ్ కమిటి చైర్మన్ సీఎం. రమేష్, తదితర ముఖ్యుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

## రాష్ట్ర అవతరణ పొట్టి శ్రీరాములదే

**రైల్వేకోడూరు, నవంబర్ 01, ప్రభాతవార్త:**



పొట్టి శ్రీరాముల త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని వాసవి క్లబ్ నాయకులు పెండ్యాల విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని యువత అమరజీవి పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో నడిచి ఆంధ్ర రాష్ట్రానికి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ముఖ్యంగా ఎన్నో దినాలు నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర అవతరణకు నిరంతరం శ్రమ పడ్డారని అన్నారు. ఈ రోజు స్వేచ్ఛ వాతావరణము పొట్టి శ్రీ రాములు అందించిన ఘనతనని అన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ నిరంజన్ బాబు, రీజినల్ సెక్రటరీ వేమ వెంకట కిషోర్ బాబు, వాసవి క్లబర్ అధ్యక్షుడు తిరునామల కుమార్, తిరునామల సత్యనారాయణ, కలువ సోమశేఖర్ తో పాటు గర్రె నరసయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొని ప్రధాన రహదారి వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.

## 60 మందికి పైగా సభ్యత్వాలు నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ నాయకులు

**లక్కిరెడ్డిపల్లె, నవంబర్ 01, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని దిన్నెపాడు పంచాయతీ పర్వతరెడ్డిగారిపల్లె బూతు నందు మోహన్‌రెడ్డి, సుదర్శన్ బాబు, అచ్చిరాజుల ఆధ్వర్యంలో దాదాపు 60 మందికి పైగా తెలుగుదేశం సభ్యత్వాలు నమోదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేవలం 100 రూపాయలు సభ్యత్వంతో 5లక్షలు భీమా పొందవచ్చునన్నారు. ఒక లక్ష రూపాయల ద్వారా శాశ్వత సభ్యత్వం పొందవచ్చునన్నారు. ఇలాగే ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకొని 5 లక్షల భీమాను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు చేయుతనివ్వడమే ముఖ్యమంత్రి ధ్యేయం



**రైల్వేకోడూరు అర్బన్, నవంబర్01, ప్రభాతవవార్త :**
మహిళా సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అలాగే మహిళలకు చేయుతనివ్వడమే ఆయన ధ్యేయం అని రైల్వే కోడూరు టిడిపి ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా శుక్రవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అథిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో దేనికి ప్రాధాన్యతనిద్దాం అని ముఖ్యమంత్రిని అడుగగా ఉచిత సిలిండర్ల పథకం అమలు చేద్దామని తాను చెప్పానని తాను సూచించిన విధంగానే అదే పథకాన్ని అమలు చేయడం తనకు అత్యంత సంతోషాన్నిచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అక్క చెల్లెమ్మలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇచ్చిన ప్రతి వాగ్దానం నిరవేర్చటంలో ఎన్డీఓ కూడటి ముందు వరుసలో ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రిలు కలసి ప్రజలకు కావాల్సిన పథకాలు అమలు చేయడంలో సాహతోపేతంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీదర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ గ్రామ ఉధ్యాన అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్

**లక్కిరెడ్డిపల్లె, నవంబర్ 01, ప్రభాతవార్త:**



గ్రామ ఉధ్యాన అసోసియేషన్ రాష్ట్ర అదనపు జనరల్ సెక్రెటరీగా వీరబల్లి శ్రీకాంత్‌ను అన్ని జిల్లాల గ్రామ ఉధ్యాన ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ ఫణీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామ ఉధ్యాన ఉద్యోగుల సమస్యల తరపున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. తన ఎంపికకు సహకరించిన గ్రామ ఉధ్యాన ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

## వెల్లాల దేవస్థానం కళ్యాణ మండపము బాడుగకు వేలం

**రాజుపాళెం, నవంబరు 01, ప్రభాతవార్త.**
మండల పరిదిలోని వెల్లాల దేవస్థానం లోని శ్రీసంజీవరాయస్వామి కళ్యాణ మండపము మూడు సంవత్సరములకు బాడుగకు ఇచ్చుటకు వేలం 5వతేది మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించుతున్నట్లు దేవస్థానం ఇఓ బి.వి.నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈవేలంలో పాల్గొనదలచివారు, మరియు వేలంలను దక్కించు కొన్నవారు దేవస్థానం షరతులకు లోబడి నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. కళ్యామంటపంనకు డెకరేషన్ వేలం 5వతేది 12.30లకు వేలం నిర్వహించనున్నట్లు ఇఓ తెలిపారు. భక్తులు దాదాపు ఒక సంవత్సరం క్రితం నుండి సమర్పించిన బియ్యం, బేడలు, బెల్లం నూనెలు కూడా 5వతేది న 12 గంటలకు వేలం వేయనున్నట్లు ఇఓ నరసయ్య తెలిపారు.

## సీఎం సహాయనిధి కింద చెక్కులు పంపిణీ

**ఓబులవారిపల్లె, నవంబరు 1, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలం, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పలు మండలాలకు సంబంధించిన సీఎం సహాయ నిధి చెక్కులు బాధితులకు రూ.5లక్షలు శుక్రవారం టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఓబులవారిపల్లి మండలం ముక్కవారిపల్లి గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందని ప్రభుత్వం వచ్చిన తరువాత ఆధ్యాత్మిక రంగానికి గ్రామాల అభివృద్ధికి రూ.100 కోట్లు పైనే నిధులు మంజూరయ్యాయని ఇక రైల్వేకోడూరు నియోజకవర్గం ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేయడమే మా లక్ష్యమన్నారు. రూపానందరెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సారధ్యంలో నియోజకవర్గం అంచలంచెలుగా అభివృద్ధి చెందుతుందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరెడ్డి, బి.వేణుగోపాల్‌రెడ్డి, సీఎం సహాయ నిధి బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో ఎంపీడీఓ, టీడీపీ నాయకులు



**గాలివీడు, నవంబర్ 1(ప్రభాతవార్త):**
మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్లు పంపిణీ శుక్రవారం తెల్లవారు జాము నుండే ప్రారంభం అయ్యాయి. ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బంది పంపిణీ చేశారు. నూలివీడులో ఎంపీడీఓ జవహర్‌బాబు, తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటశివారెడ్డి, మాజీ సర్పంచ్ ఫరీద్‌బాషాలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు, టీడీపీ యువ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం ఉదయాన్నే గ్రామంలోని అర్హులైన లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి వృద్ధాప్య పింఛన్లు ఒక్కొక్కరికి రూ.4 వేలుచొప్పున అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి, ఫరీద్‌బాషాలు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీకి అధిక ప్రాధాన్యతమిస్తోందన్నారు. మొదటి రోజునే నూరు శాతం పింఛన్లు పంపిణీకి కృషి చేయాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాలు ఢీ

### - ఒకరికి గాయాలు.. ఇంకొకరి పరిస్థితి విషమం

**గాలివీడు, నవంబర్ 1(ప్రభాతవార్త):**





పేరాలగుట్ట వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో కదిరి రామకృష్ణ(48) గాయాలు కాగా సురేంద్ర(42) అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పోలీసుల కథనం మేరకు గాలివీడు గ్రామం ఈతోటివారిపల్లెకు చెందిన రామకృష్ణ శుక్రవారం గాలివీడు నుండి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో పేరాలగుట్ట వద్దకు రాగానే పెద్దమండెం మండలం మట్లివారిపల్లెకు చెందిన సురేంద్ర ద్విచక్రవాహనం పరస్పరం ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఇందులో రామకృష్ణ కాలుకు గాయమవ్వగా.. సురేంద్ర తలకు బలమైన గాయం కారనంగా చెవిలో తీవ్ర రక్తస్రావంతో పరిస్థితి విషమంగా మారింది. వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

## ఇరువర్గాల మధ్య ఘర్షణ - ఐదు మందికి గాయాలు

**రాజంపేట, నవంబర్ 01, ప్రభాతవార్త :**



దీపావళి సందర్బంగా గత గురువారం రాత్రి టపాసులు తెచ్చిన తంటా రాజంపేట మండలంలోని ఇసుకపల్లె ఇందిరమ్మ కాలనీలో ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఎంతో కాలంగా వారి మధ్య ఉన్న పాత కక్షలు టపాసుల పండుగ సందర్భంగా టపాకాయలు పేలుస్తున్నారన్న సాకుతో అదే గ్రామానికి చెందిన పెంచలయ్య, శ్రావణ్, రోహిత్‌లు కలసి టపాసులు కాలుస్తున్న వెంకట్రమణ, రమణయ్య, వెంగమ్మ, శ్రీనాద్, సుబ్బరాయుడులపై దాడి చేసి వారిని తీవ్రంగా గాయపరచడం జరిగింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమేదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన

## మద్యం షాపులను తొలగించడండి : సిఐటీయు



**రాజంపేట, నవంబర్ 01, ప్రభాత వార్త :**
ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన మద్యం షాపులను తొలగించాలని సిపిఐ అనుబంధ సంస్థ అయిన ఏఐటియుసి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాజంపేటలోని పాత బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపుల తొలగింపు పై ధర్నా చేశారు. ఈ సందర్బంగా ఏఐటియుసి నాయకుడు సిహెచ్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ మద్యం షాపుల పట్ల ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తుందన్నారు. బస్టాండులో మద్యం షాపులు ఏర్పాటు చేసి వారు అక్రమ వ్యాపారాలు చేయడమే కాకుండా ఎంతో కాలం నుంచి అక్కడ ఆటో స్టాండు గా ఉన్న ఆటోలను షాపులకు అడ్డంగా లేకుండా తొలగించాలని వారిపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. అనంతరం పాత బస్టాండు నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఎస్‌ఐ సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమమంలో రాజంపేట, కోడూరు ప్రాంతాలకు చెందిన ఆటో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి దీక్షా పరులకు వస్త్రాలు పంపిణీ

**బ్రహ్మంగారిమఠం, నవంబర్ 1 ప్రభాతవార్త :**



మండల కేంద్రంలోని శ్రీకృష్ణ దేవరాయ బలిజ సంఘం అన్నదాన సత్రంలో శుక్రవారం బద్వేలుకు చెందిన దరిమిశెట్టి అశోక్ రాయల్ తన తండ్రి వెంకటయ్య జ్ఞాపకార్థం మండలవ్యాప్తంగా ఉన్న అయ్యప్పస్వామి దీక్షా పరులకు 100 మందికి భక్తులకు ఉచితంగా దీక్షకు సంబంధించిన వస్త్రములను, పూజా సామాగ్రిని అచలానంద ఆశ్రమ మఠాధిపతులు విరజానంద స్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విరజానందస్వామి మాట్లాడుతూ సమాజహితం కోసం మానవదాతృత్వంతో ఇలాంటి దానధర్మాలు చేస్తున్న అశోక్ గొప్ప మనసుకు భగవంతుడు ఎల్లవేళలా మంచిని చేకూర్చాలని ఆకాంక్షించారు. దీక్ష తీసుకున్న భక్తులు నిత్యం అయ్యప్పస్వామిని స్మరించుకుంటూ భక్తి భావనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు రమణయ్య, ఆకుల శివకుమార్, కె.రవి, డి.వీరాంజనేయులు, రమణయ్య, బలిజసత్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఖాజీపేట అయ్యప్ప గుడిలో స్వాములకు సేవ సు'భిక్ష'



**ఖాజీపేట, నవంబర్ 01, ప్రభాతవార్త:**

ఖాజీపేట మండలంలో దాదాపు 8సంవత్సరాల కిందట అయ్యప్ప స్వామి దేవస్థానం నిర్మాణానికి పునాది రాయి వేశారు. దేవస్థాన చైర్మెన్ పివి కృష్ణారెడ్డి, గురుస్వాములు రాఘవరెడ్డి మరియు కమిటీ వారు మిత్రులు గ్రామ గ్రామాన తిరిగి చందాలు పోగుచేసి దాదాపు ఒక కోటి 50లక్షల రూపాయలతో గుడి నిర్మాణం పూర్తి గావించారు. కార్తీక మాసం మొదలవుతున్న శుభదినాన మాలధారులు నేటితో మొదటు పెట్టి మండల కాలం పాటు దీక్షలు చేపడతారు. మిగతా దేవతామూర్తులను ఆరాధిస్తూ చేపట్టే దీక్షల కంటే ఎంతో కఠినమైనది ఈ అయ్యప్ప దీక్ష. దీక్ష మొదలైనప్పటి నుండి పూర్తయ్యే వరకు ఏకభుక్తం మాత్రమే చేయాలి. ఇంట్లో మండల కాలం పాటు నియమ నిష్ఠలతో ఆహారాన్ని తయారు చేయడం కుదరకపోవచ్చు. కొందరు స్వాములకు ఉద్యోగ ఉపాధి వివిధ పనుల నిమిత్తం వెళ్లవలసి వస్తుంది. అటువంటి స్వాములు భిక్ష కొరకు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. అలాంటి స్వాముల కోసం ఖాజీపేట అయ్యప్ప స్వామి దేవస్థానంవారు ఉచిత భిక్షను అందిస్తున్నారు. ఈ ఆలయం ద్వారా ఈ సంవత్సరం ఇప్పటికే 400 మందికి పైగా మాలధారణ గావించారు. ఈ ఆలయం నందు మండల కాలం పాటు స్వాములకి ప్రతిరోజు మధ్యాహ్నం 12గంటల నుండి రెండు గంటల వరకు భిక్షను అందిస్తున్నారు. సుమారు 200మందికి పైగా స్వాములు ప్రతిరోజు ఇక్కడ భిక్షను ఆరగిస్తున్నారు. కార్తీక మాసంలో ఈ సంఖ్య మరింతగా పెరగవచ్చని అంచనా. ఈ బృహత్తర కార్యక్రమానికి మంచి మనసుతో భక్తులు దాతలు వివిధ రూపాల్లో సహకరిస్తున్నారు. నవంబర్ 16వ తేదిన శబరిమలలో అయ్యప్ప స్వామి ఆలయాన్ని తెరచి పడిమెట్ల పూజని నిర్వహించనున్న తరుణంలో ఇక్కడ వెలసిన అయ్యప్ప స్వామి గుడిలో సైతం వేలాది మంది అయ్యప్ప స్వాములు, భక్తుల మధ్య వైభవోపేతంగా పడిమెట్ల పూజను నిర్వహించనున్నట్లు కమిటి సభ్యులు మరియు ఆలయ చైర్మెన్ తెలిపారు. కఠిన నియమాలతో కూడిన అయ్యప్ప దీక్షను భక్తి శ్రద్ధలతో కొనసాగించడం చాలా ముఖ్యం. అయ్యప్ప దీక్షలో మనిషిని భక్తి బావం కలిగి శారీరకంగా మానసికంగా మార్పులతో పరిపక్వత చెందుతారు. కులం, మతం, పేద ధనిక అనే తేడా లేకుండా అందరం సమానం అనే భావన కలుగుతుంది. భక్తి భావాన్ని మనసులో నింపుకొని కఠిన నియమాల్ని కొనసాగిస్తూ మండల దీక్షను పూర్తి చేసి ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్ర చేయడం చాలా ముఖ్యం.



ఆలయ చైర్మెన్ పీవీ కృష్ణారెడ్డి దాతల దాతృత్వంతోను తోటి మిత్రుల, కమిటి సభ్యుల సహాయ సహకారాలతో దాదాపు కోటి యాభై లక్షల రూపాయలతో అయ్యప్ప దేవస్థానాన్ని నిర్మించి, ఆలయ నిర్వహణలోనూ అందరి సహాయ సహకారాలను మరువలేము. మొదటగా మిత్రుల కమిటీ సభ్యుత సహకారంతో మొదలైన ఉచిత భిక్ష కార్యక్రమం ఇప్పుడు దాతల సహకారంతో ముందుకు వెళ్తున్నాము అన్నారు. అయ్యప్ప మాలధారులకు ప్రతి సంవత్సరం కార్తీకమాసం నుండి మండల కాలం పాటు భిక్షం ఏర్పాటుచేయడం అన్నది కొనసాగుతోంది. మాల ధరించి ఇంట్లో భిక్ష చేయుటకు అవకాశం లేని స్వాములు దేవస్థానం నందు భిక్షను స్వీకరించవలసిందిగా కోరుతున్నామన్నారు. ఇందుకు సహకరిస్తున్న దాతలు అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

- ఆలయ చైర్మెన్ పివి కృష్ణారెడ్డి

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

**నేటి యువత అమరజీవిని ఆదర్శంగా తీసుకోవాలి - ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు**

**బద్వేలు అర్బన్, నవంబర్ 01 ప్రభాతవార్త :**

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ మునగా చలమయ్య, జాయింట్ సెక్రటరీలు సగళా సురేష్‌బాబు, వైభవ్ ప్రసాద్, ట్రెజరర్ ఇమ్మడిశెట్టి చంద్రశేఖరలు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్ర వారం అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాన్ని సైతం తృణప్రాయంగా అర్పించిన అమ రజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివన్నారు. నాడు ఉమ్మడి రాష్ట్ర హయాంలో ఆంధ్ర ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని వా టినుంచి పొట్టి శ్రీరాములు విముక్తి కల్పించారంటూ ఆయన ప్రాణ త్యాగం ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించిన వాస్తవాన్ని ఎవరూ మరువలేరన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడానికి 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని, దానికి గుర్తింపుగా ఆం ధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా నవంబరు 1వ తారీఖున జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన ఆ మహనీయుడు చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ఎలాంటి ఆటంకం కలగకూడదని, ప్రత్యేక రాష్ట్రం మన హక్కు, తెలుగు భాషను తెలుగు జాతికి అంకితం చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజలందరూ ఒకటిగా ఉండాలని దృఢమైన సంకల్పం ఆలోచనతో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొని 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష అనంతరం తన ప్రాణాలర్పించిన మహనీయుడని వారు ఆయన సేవలను కొనియాడారు. నేటి యువత అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు మడియాల సుబ్బయ్య, జూటూరు రవి, కొలిశెట్టి క్రిష్ణయ్య, మదళ్లపల్లె సత్యం, నేలపాటి గోవిందు, దుద్యాల సత్యం, నాగరాజ, కోట మధు, శ్రీనివాసులు, మెంటా నాగేంద్ర, పెసలనాగరా, నేలపాటి వెంకటసుబ్బయ్య జూటూరు సుదర్శన్, పసుపుల రవిశంకర్, తో పాటు పలువురు పాల్గొన్నారు.



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్యవైశ్య వర్తక సంఘం సభ్యులు

**అమరజీవి సేవలు మరువలేనివి :**

బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటి అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు, గురుమూర్తి, సత్తార్, రసూల్, నాగార్జున, కిరణ్‌కుమార్, ఆంధ్రరాష్ట్ర అవతరణ కై తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా ప్రాణాలర్పించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని వారు పేర్కొన్నారు. దేశ స్వాతంత్య్ర పోరాటంలో కూడా ఆయన చురుగ్గా పాల్గొన్నారని ఆయన చేసిన పోరాటాల ఫలితంగానే మంద్రాసు రాష్ట్రంనుంచి ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. నాడు ఉమ్మడి రాష్ట్ర హయాంలో ఆంధ్ర ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, వాటినుంచి పొట్టి శ్రీరాములు విముక్తి కల్పించారంటూ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మురుగు నీటి సమస్యను తీర్చండి

**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 01, ప్రభాతవార్త:**

మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్టీసి బస్టాండ్‌కు ఎదురుగా ఉండే ఎర్రబల్లె కాలనీలో మురుగు నీటి కాలువలు అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు నీరు కాలువలో సాగగా రోడ్లపైకి మారడం జరుగుతోంది. మురుగు నీరు రోడ్లపై పారడం జరుగుతోంది. మురుగు నీరు రోడ్లపై పారడంతో దుర్వాసనతో పాటు దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. నూతనంగా నిర్మించిన డ్రైనేజికి సైడ్ కాలువలు అనుసంధానం చేయకపోవడంతో మురుగునీరు ముందుకు పారక ఆటంకంగా మారింది. నూతనంగా డ్రైనేజి నిర్మించిన సమయంలో అధికారులు పర్యవేక్షించగా నిర్లక్ష్యంగా ఉండటంతోనే అస్తవ్యస్తంగా డ్రైనేజి నిర్మాణం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రత్యేక దృష్టి సారించి కాలువలు అనుసంధానం చేయించి మురుగునీరు సాఫీగా సాగేలా చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



# సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలలో 3 ఉచిత గ్యాస్ సిలిండర్ అమలు

**ప్రొద్దుటూరులో ప్రారంభించిన టిడిపి నాయకులు**



**ప్రొద్దుటూరు, నవంబర్ 01, ప్రభాతవార్త:**

గత సార్వత్రిక ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం సూపర్ 6 సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చే క్రమంలో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డిలు అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస్‌నగర్‌లోని బాలాజి గ్యాస్ ఏజన్సీ ఆవరణలో వారు ఉచిత గ్యాస్ సిలిండర్లను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా మహిళలకు ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలలో తెలుగుదేశం పార్టీ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అహర్నిషలు శ్రమిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో త్వరలోనే సూపర్‌సిక్స్‌లోని మరికొన్ని సంక్షేమ పథకాలను అమలు చేసే దిశగా ప్రభుత్వం అందులో భాగంగానే ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 3సిలిండర్లను కూటమి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని వివరించారు. మిగిలిన పథకాలను కూడ త్వరలోనే అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, కౌన్సిలర్ జిలాన్ బాష, వార్డు టిడిపి నాయకులు టప్పా మహబూబ్ బాష మరియు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివాలయంలో ఆకాశదీపం

**పుల్లంపేట, నవంబర్01, ప్రభాతవవార్త :**

మండల కేంద్రంలోని శ్రీ పర్వతవర్ధిణి దేవి సమేత శ్రీ శాంతి లింగేశ్వర స్వామి దేవస్థానం నందు శుక్రవవారం కార్తీక మాసం ప్రారంభోత్సవం సందర్భంగా ఆకాశదీపాన్ని వెలిగించడం జరిగింది. శ్రీ శివపార్వతి విద్యాసంస్థల కరస్పాండెంట్ సోము బాలాజీ బాబు దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం జరుగుతుంది. కాగా పుల్లంపేట శివాలయంలో కార్తీక మాసం అంతా ప్రతిరోజు ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం పరిపాటి ముఖ్యంగా కార్తీక సోమవారాల్లోను, కార్తీక పౌర్ణమి రోజులలోనూ వందలు, వేల సంఖ్యలో మండలం నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి భక్తులు చేరుకొని పూజల్లో పాల్గొంటారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా కళ్యాణోత్సవం రోజున ప్రత్యేక అన్నదాన కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాలకు సుమారు 3వేల హాజరు కావడం జరుగుతుంది. ఈ అన్నదాన కార్యక్రమాలను స్థానిక శివాలయం భక్తుడు దేవక కొండ నరశింహులు ఆద్వర్యంలో జరుగుతుంది. ఈయన ప్రతి సంవత్సరం భక్తుల నుంచి విరివిగా విరాళాలు సేకరించి ఎంతో ఘనంగా కార్తీక మాసంలో ఈ కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఆకాశదీపం కార్యక్రమంమలో దేవస్థానం ప్రధాన అర్చకులు ఈశ్వర్ రావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ కుల ధృవీకరణ పత్రంతో ఉద్యోగం కూడదు

**(సుస్పష్టం చేసిన సుప్రీం కోర్టు)**

**బద్వేలు లీగల్, నవంబరు 01 ప్రభాతవార్త :**

తప్పుడు కుల ధృవీకరణ పత్రాల ద్వారా ఉద్యోగాలు సంపాదించిన వారికి ఏలాంటి రక్షణ ఇవ్వకూడదని సుప్రీం కోర్టు ఇటీవల కాలంలో ఓ తీర్పులో సుస్పష్టం చేసింది. తప్పుడు సర్టిఫికెటుతో రిజర్వేషన్ క్రింద ఉద్యోగం సంపాదించి ఉద్వాసనకు గురైన వ్యక్తిని తిరిగి నియమించే అంశాన్ని పరిశీలించాల్సిందిగా ఒక ప్రభుత్వ సంస్థను ఆదేశిస్తూ ఒరిస్సా హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు కొట్టివేసింది (భువనేశ్వర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎదిరి మధుమితా దాస్ అండ్ అదర్స్ సివిల్ అప్పీల్ నెం.3320 ఆఫ్ 2023) కేసులో సుప్రీం కోర్టు ఈ మేరకు తాజా తీర్పును వెలువరించింది. కులం సర్టిఫికెట్‌ను మోసపూరితంగా సమర్పించారా? తాము తప్పు చేయడం లేదనే నమ్మకంతోనే సమర్పించారా? అనేది అప్రస్తుతమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. కులానికి సంబంధించిన ప్రతివాది క్లెయిమ్ మోసపూరిత ఉద్దేశ్యంతో చేసినదా? లేదా సదుద్దేశ్యంతో చేసినదా? అన్నది ముఖ్యం కాదని, రిజర్వ్ చేసిన ఉద్యోగాన్ని తనకు అర్హత లేకపోయినా పొందినపుడు తాను సమర్పించిన కుల ధృవీకరణ పత్రం సరైనది కాదని తేలినపుడు ఆమెను ఉద్యోగం నుండి తొలగించవలసినదేనని సుప్రీం కోర్టు సుస్పష్టం చేసినది. గతంలో చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (2017) (8ఎస్‌సిసి670) కేసులో ఇచ్చిన తీర్పును కూడా సుప్రీం కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించి నకిలీ కుల ధృవీకరణ పత్రంతో ఎన్నటికీ ఉద్యోగం కూడదని స్పష్టం చేసింది.

# ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే షాజహాన్‌బాషా**



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న దృశ్యం

**మదనపల్లె, నవంబర్ 1 ప్రభాతవార్త :**

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంతో పాటు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌టిఆర్ పెన్షన్లను పంపిణీ చేశారు. కురవంక, కోళ్ళబైలు, పొన్నూటిపాలెం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకం కింద మంజూరైన నిధులతో రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. జడ్పిహైస్కూల్‌లో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిప్పుసుల్తాన్‌మైదానంలో దీపం-2 పథకం కింద లబ్దిదారులకు మంజూరైన ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాటిలో తొలుత రూ.4వేలకు పెన్షన్లు పెంచడం జరిగిందన్నారు. అదే విధంగా ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా దీపావళి పండగ సందర్భంగా శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చుతారన్నారు. పల్లెపండగ కార్యక్రమంతో ఇప్పటికే నియోజకవర్గంలో రూ.6కోట్లతో వివిధ అభివృద్ధి పనుల నిర్మాణాలకు భూమి పూజ చేయడం జరిగిందన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందించడమే ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, తహశీల్దార్ ఖాజాబీ, ఎంపిడిఓ మస్తాన్‌వల్లి, ఏఈ రమణ, సర్పంచ్ చిప్పిలి చలపతి, టిడిపి నాయకులు నాదేళ్ళ విద్యాసాగర్, జేసిబి వేణు, మధుసూదన్‌రెడ్డి, మోహన్, కౌన్సిలర్లు ఆర్‌కె.రామక్రిష్ణ తులసి, కరీముల్లా, గాంధీ, జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిమ్మనపల్లెలో చిరుత సంచారం

**భయ బ్రాంతులతో గ్రామీణులు... దూడను చంపేసిన చిరుత**



పోస్టుమార్టం నిర్వహిస్తున్న దృశ్యం

**మదనపల్లెక్రైం, నవంబర్ 1 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె మండలంలోని ముష్టూరు పంచాయితీ చల్లావారిపల్లెకు సమీపంలో బోడిబండవద్ద ఓ ఇళ్ళు నిర్మించుకొని ఆవులను మేపుకొంటూ జీవనం సాగిస్తున్న ఆదెన్న శుక్రవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో తమ గృహం నుంచి ఆవుల నుంచి పాలు పిండి చల్లావారిపల్లెకు తీసుకెళ్ళి పాలు అమ్ముకొని తిరిగి ఇంటికి వచ్చేసరికి ఓ పేయదూడను చిరుత కొంతదూరం ఈడ్చుకొని వెళ్లి చంపినట్లు రైతు కొనుగొన్నాడు. ఈ విషయాన్ని స్థానిక రెవెన్యూ సిబ్బంది అటవీసిబ్బంది, పశువైద్యులకు తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకొన్న అధికారులు పశువైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. స్థానిక గ్రామాల్లోని ప్రజలు చిరుత సంచారం చేస్తోందని జాగ్రత్తగా నడచుకోవాలని తహశీల్దార్ దనాంజనేయులు, ఆర్ఐ రామ్‌ప్రసాద్‌లు తెలిపారు. ఎక్కడైనా చిరుత జాడ కనపడితే పారెస్టు అధికారులు తెలిపాలన్నారు.

# వైసీపీ నాయకులు వనం పెంచల బాబు మృతి బాధాకరం

**:ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి**

**బద్వేలు అర్బన్, నవంబర్ 01 ప్రభాతవార్త :**



బద్వేలు మున్సిపాలిటీ పరిధి 16వ వార్డు వైసీపీ బూత్ కన్వీనర్ వనం పెంచలబాబు (46) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి నిమ్మకాయల గురివిరెడ్డి, మాజీ స్టేట్ డైరెక్టర్ సుందరరామిరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కల్లూరి రమణారెడ్డి, కౌన్సిలర్ సత్యనారాయణతో పాటు పలువురు వైసీపీ నాయకులు పెంచలబాబు బౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పార్టీలో పెంచలబాబు కష్టపడి పనిచేసి గత ఎన్నికలలో భారీ మెజార్టీకి ఎంతగానో కృషిచేశారన్నారు. మంచితనానికి మారుపేరుగా ఉండి గుండెపోటుతో మృతి చెందిన పెంచలబాబు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని వారు ఆకాంక్షించారు. వీరివెంట తోట నాగేశ్వరరావు, సరిటాల మౌలాలి, ఓబయ్య, పిచ్చయ్య,వనం నరసింహులు, తాతనబోయిన వెంకటసుబ్బయ్య, పీరయ్య తోపాటు పలువురు 16వ వార్డు నాయకులు ఉన్నారు.



# 3న వక్ఫ్ పరిరక్షణ మహాసభ




**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 01, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం నూతనంగా వక్ఫ్ ఆమోదం బిల్లుకు వ్యతిరేకంగా నిరసనగా జమాఅతె ఇస్లామి హింద్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5గంటలకు విజయవాడ కుమ్మరిపాలెం ఈద్గా మైదానంలో ఒక గొప్ప మహాసభ ఏర్పాటుచేయడం జరిగిందని వక్ఫ్ బోర్డు పరిరక్షణ మహాసభ కన్వీనర్ సలీం తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపు జరిగే ఛలో విజయవాడకు పట్టణంలోని మైనార్టీ సోదరులు అందరూ ఈ మహాసభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. పట్టణం నుండి బస్సులు ఏర్పాటుచేశామని, కావున కార్యక్రమంలో భాగస్వాములు కావాల్సిన వారు 94400 94179, 94415 02186, 94400 74899, 98662 67649 నంబర్లకు సంప్రదించి టికెట్ విశయం తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అబ్దుల్ సమద్, స్థానిక మీడియా కార్యదర్శి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు మహిళలకు ఉచిత సివిల్స్ శిక్షణ

**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 01, ప్రభాతవార్త:**

తేదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి సారధ్యంలో ఢిల్లీకి చెందిన ప్రముఖ సివిల్స్ కోచింగ్ సంస్థ డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ వారు ప్రొద్దుటూరు నవంబర్ 3న ఆదివారం ఉచిత సివిల్స్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కోశాధికారి కోటా ఓబుళరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో ఎన్నో సంవత్సరాలుగా లక్ష్మయ్య ఐఏఎస్ స్టడి సర్కిల్ నుండి ఎంతోమంది సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కూడ డిగ్రీ పూర్తి చేసుకున్న యువతుల కోసం అన్ని వసతులతో కూడిన ఉచిత శిక్షణను అందించాలనే తపనతో లక్ష్మయ్య ఐఏఎస్ స్టడి సర్కిల్ వారిని సంప్రదించగా వారు ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేయడం కోసం ముందుకు వచ్చారని ఆయన చెప్పారు. ప్రొద్దుటూరులోని కామిశెట్టి డిగ్రీ కళాశాలలో నవంబర్ 3న ఆదివారం రోజున ఉదయం 10గంటలకు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఆశావాహులకు సివిల్స్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులకు ఒక అర్హత పరీక్ష నిర్వహించి అందులో ఎంపికైన వారికి రెండు సంవత్సరాల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రూప్స్‌లో ఉత్తీర్ణులైన వారిని కూడ సివిల్ సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ కోసం ఎంపిక చేస్తామన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని డిగ్రీ పూర్తి చేసుకున్న మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి-98856 09999, కోటా ఓబుళరెడ్డి-99493 32920, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డిలను సంప్రదించాలని ఆయన కోరారు.

# ఆలయాల్లో ఘనంగా ధనలక్ష్మి పూజ

**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 01, ప్రభాతవార్త:**



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన శ్రీ వాసవీ మత్కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం(అమ్మవారి శాల), పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో, పాత మార్కెట్‌లోని శ్రీ లలితా దేవి రతనాల వెంకటేశ్వర స్వామి (అన్నా చెల్లెలు) ఆలయంలో అమ్మవార్లకు ధనలక్ష్మి పూజ నిర్వహించారు. ఆలయ మూలవిరాట్టులకు ప్రత్యేక గో క్షీర, పంచామృత అభిషేకాలు, విశేష పూజలు, ధనంతో అలంకరణ, మహానివేదన, మహా మంగళహారతి నిర్వహించి, పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



# జాతీయ సమైక్యతా స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్




**లక్కిరెడ్డిపల్లె, నవంబర్ 01, ప్రభాతవార్త:**

ప్రజలంతా భేదాభిప్రాయాలు విడిచిపెట్టి జాతీయ ఐక్యత భావంతో మెలగాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం కావాలని భగత్‌సింగ్, మహాత్మగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి గొప్ప నాయకులు ఎన్నో ఉధ్యమాలు చేశారని అన్నారు. అనంతరం జాతి ఐక్యతపై విద్యార్థులతో కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దాదిబి, సూపర్‌వైజర్లు బ్లాక్ కో ఆర్డినేటర్ లత, విద్యార్థులు పాల్గొన్నారు.

# తప్పు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు

**పీలేరు, నవంబరు 01 ప్రభాతవార్త:**

స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణంలో కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత పదిరోజులు క్రితం ఇద్దరు విద్యార్థులు గంజాయి మత్తులో రైలు కిందపడి మతిచెందడం బాధాకరమన్నారు. ఇంత చిన్న వయస్సులో మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవడం వంటి ఘటనలు పునరావతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులకు మరోసారి సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను కళాశాలకు వెళుతున్నారు, చదువుకుంటున్నారన్న నమ్మకాన్ని పక్కన పెట్టి వారి నడవడికపై దష్టిపెట్టాలని సూచించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలను కాపాడాలని, గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు విక్రయించిన, కొన్నా ఎంతటివారినైనా సరే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని గుర్తుచేశారు.

